









మండుటెండల్లో విధులు

సిద్దిపేట క్రైం, మే 10 (ఆంధ్రజ్యోతి): మండుటెండల్లో ట్రాఫిక్ పోలీసుల విధి నిర్వహణ కత్తి మీద సాము లా మారింది. వేడి గాలులు వీస్తున్నా.. వడదెబ్బలు తగులుతున్నా ట్రాఫిక్ పోలీసులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటున్నారు. రెండు మూడు రోజుల సూర్యుడి ప్రతాపానికి బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. కానీ ట్రాఫిక్ పోలీసులు మండుటెండల్లో బాధ్యతగా విధులు కొనసాగిస్తున్నారు. ఇబ్బందులు ఎదురవుతున్నా లెక్క చేయకుండా సమర్థవంతంగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు గజ్వేల్‌లో రెండు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఒక ట్రాఫిక్ ఏసీపీ, ఇద్దరు సీఐలు, ఒక ఎస్ఐ, ముగ్గురు ఏఎస్ఐలు, 12 మంది హెడ్ కానిస్టేబుల్స్, 21 మంది ట్రాఫిక్ కానిస్టేబుల్స్, 12 మంది హోంగార్డ్స్ మొత్తం 52 మంది ఉన్నారు. వీరిని ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ను బట్టి రెండు షిఫ్టులుగా విభజించి విధులు కేటాయిస్తున్నారు. మొదటి షిఫ్ట్ ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు, రెండో షిఫ్ట్ మధ్యాహ్నం రెండు గంటల నుండి రాత్రి 8 గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. అయితే విధులు నిర్వహించడం తప్పనిసరైనా వడదెబ్బకు గురికాకుండా ఎప్పటికప్పుడు మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ వంటివి తీసుకోవాలని, హెల్మెట్లు, క్యాప్‌లు, కళ్లకు కూలింగ్ గ్లాసెస్ ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

డీజిల్‌కు డబ్బులు లేక ఇంటింటికీ చెత్త సేకరణకు వచ్చే వాహనాలు మూలకు పడటంతో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోయింది. రోడ్లపై మురుగు పారుతున్నది. ఓపెన్ డ్రైనేజీల పూడిక తీసి ఎక్కడికక్కడే వదిలేశారు. దీంతో పల్లెలు చెత్తచెత్తగా మారి కంపుకొడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడమే దీనికి కారణంగా తెలుస్తున్నది.



చెత్త చెత్తగా..

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

- పంచాయతీ ట్రాక్టర్ల డీజిల్‌కు డబ్బులు కరువు
- రోజువారీగా చెత్త సేకరణకు తిలోదకాలు
- వీధులగుండా పరుగు పెడుతున్న మురుగు
- ఎక్కడికక్కడే మోరీ పూడికతీత వ్యర్థాలు, చెత్త
- ఇదే కొనసాగితే విషజ్వరాలకు ప్రబలే అవకాశం

సిద్దిపేట, ఆంధ్రజ్యోతి, మే 10: సిద్దిపేట రూరల్ మండలంలోని రావురూకుల గ్రామంలో వారం రోజులుగా చెత్తను సేకరించడం లేదు. మురుగు కాల్వల నుంచి తీసిన పూడిక వ్యర్థాలను ఎక్కడికక్కడే ఉంచారు. ఇక నారాయణరావుపేట మండలంలో ఏకంగా నెల నుంచి చెత్త సేకరణకు వాహనాలు రాకపోవడంతో గ్రామస్థులు బహిరంగ స్థలాలు, శివారు ప్రాంతాల్లో చెత్తను పారేస్తున్నారు. ఇవేకాకుండా సిద్దిపేట జిల్లాలోని పలు ప్రాంతాల్లో గ్రామాల్లో ఇదే తంతు కొనసాగుతున్నది. ఫలితంగా పల్లెల్లో పారిశుధ్యం పడకేస్తున్నది. గ్రామ పంచాయతీల్లో నిధులలేమి కారణంగా చెత్త సేకరణకు వచ్చే వాహనాలలో డీజిల్ పోయించుకునేందుకు డబ్బులు లేకపోవడంతో అవి మూలకు చేరుతున్నాయి.

నాడు ఉత్తమంగా.. నేడు చెత్తగా..

ఒకప్పుడు ఉత్తమ గ్రామ పంచాయతీలుగా అవార్డులు పొంది దేశంలోని ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలిచిన పలు గ్రామాలు నేడు చెత్త సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయి. చాలావరకు గ్రామాల్లో రహదారుల వెంట కుల్లిన వ్యర్థాలు, చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో మురుగు కాల్వల పూడికతీత పనులు చేపట్టకపోవడంతో మురుగునీరు రోడ్డుపై పరుగు పెడుతున్నది. దీంతో ఆ ప్రాంతమంతా కంపుకొడుతున్నది.



నర్సాపూర్ గ్రామ శివారులో పేరుకుపోయిన చెత్త



ఎల్లుపల్లి గ్రామంలో డ్రైనేజీ పూడిక తీత వ్యర్థాల కుప్పలు



రావురూకుల గ్రామంలో రోడ్డుపై పారుతున్న మురుగు

గ్రామ కార్యదర్శులపైనే భారమంతా..

గ్రామాల్లో చెత్త సేకరణకు వచ్చే వాహనాలకు డీజిల్ అందించే పెట్రోల్ బంకుల్లో వేలల్లో అప్పులు పేరుకుపోవడంతో బంకు యజమానులు డీజిల్ పోయడం ఆపేశారు. దీంతో పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి మరీ డీజిల్ పోయిస్తూ అప్పుడప్పుడు చెత్తను సేకరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, పేరుకుపోయిన బకాయిలు, ప్రస్తుతం వాహనాలకు డీజిల్ పోయించేందుకు నిధుల మంజూరీకి కృషి చేయాలని పంచాయతీ కార్యదర్శులు కోరుతున్నారు.

ఏడాదికి పైగానే కార్యదర్శుల పాలన..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో నిర్వహణ మొత్తం

-మిగతా 8వ పేజీలో...

సంగారెడ్డి జిల్లాలో 25 మంది

నకిలీ డాక్టర్లపై కేసులు

- ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే కఠిన చర్యలు
- టీజీఎంసీ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీనివాస్
- జిల్లా వ్యాప్తంగా క్లినిక్‌లు, ఆస్పత్రుల్లో టీజీఎంసీ ముమ్మర తనిఖీలు

సంగారెడ్డి అర్బన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలో 25 మంది నకిలీ డాక్టర్లపై కేసుల నమోదుకు చర్యలు తీసుకోనున్నట్టు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్(టీజీఎంసీ) వైస్ చైర్మన్ డా.శ్రీనివాస్ తెలిపారు. సంగారెడ్డిలోని ఐఎంఏ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీజీఎంసీ వైస్ చైర్మన్ డా.శ్రీనివాస్, మెంబర్ డా.ఎస్.ఆనంద్ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలోని మాల్కాపూర్, సదాశివపేట, సంగారెడ్డి, నర్సాపూర్, దౌల్తాబాద్, కంకోల్, ఇస్నాపూర్, జహీరాబాద్ ప్రాంతాల్లోని పలు క్లినిక్, ఆస్పత్రులలో ఐదు బృందాలు ఆకస్మిక తనిఖీలు చేసినట్టు వివరించారు. ఆయా క్లినిక్‌లలో కొందరు బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, డి.ఫార్మ్ విద్యార్హతలు కలిగి ఉండి కూడా వైద్య మండలి గుర్తింపు లేకుండా మోడరన్ మెడిసిన్ ప్రాక్టీస్ చేయడం, స్టెరాయిడ్లు, పెయిన్ కిల్లర్లు రాస్తూ ప్రజారోగ్యాన్ని హానికి గురి చేస్తున్నట్టు గుర్తించినట్టు పేర్కొన్నారు. కొన్ని క్లినిక్, ఆస్పత్రులు డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ(డీఎంహెచ్‌వో)అనుమతి లేకుండా నడుస్తున్నట్టు వివరించారు. ఇది జాతీయ వైద్య మండలి చట్టం సెక్షన్ 34, 54 ప్రకారం తీవ్రమైన నేరమన్నారు. ఎలాంటి విద్యార్హత లేకుండా నకిలీ డాక్టర్లుగా చెలామణి అవుతూ మూడు సారి పట్టుబడితే పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. నకిలీ వైద్యులపై మెడికల్ కౌన్సిల్ కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. తనిఖీలో గుర్తించి ఆధారాల ఆధారంగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయిస్తామని తెలిపారు. తనిఖీల నివేదికకు జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు సమర్పించనున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎథిక్స్ కమిటీ చైర్మన్ డా.కిరణ్‌కుమార్, టీజీఎంసీ మెంబర్లు డా.విష్ణు, డా.సన్నీడేవీస్, డా.రాజీవ్, డా.హారిక, డా.శిరీష్, ఐఎంఏ డాక్టర్లు డా.చక్రపాణి, డా.హరికుమార్‌గౌడ్, డా.సురేశ్ తదితరులు ఉన్నారు.



సంగారెడ్డిలోని ఓ క్లినిక్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న టీజీఎంసీ వైస్ చైర్మన్ శ్రీనివాస్

ప్రశాంతంగా టీజీఆర్‌జేసీ సెట్

సిద్దిపేట కల్చరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): టిజిఆర్‌జేసి ఎంట్రన్స్ ఎగ్జామ్ ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో ఏర్పాటుచేసిన 9 పరీక్ష కేంద్రాల్లో 2235 మంది విద్యార్థులకు గాను 1953 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 282 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తంగా 87.4 శాతం హాజరు నమోదైందని అధికారులు తెలిపారు. పరీక్ష 10 గంటల నుండి 12.30 గంటల వరకు పరీక్ష నిర్వహించగా సెంటర్ల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్‌ను అమలు చేశారు. పరీక్ష సెంటర్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్ష సజావుగా సాగేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



విద్యుత్ ధగధగలు

హుస్నాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని ప్రధాన రహదారి రాత్రి పూట రంగురంగుల విద్యుత్ దీపాలతో వెలిగిపోతుంది. పట్టణంలోని ప్రధాన రహదారిలో ఉన్న సెంట్రల్ లైటింగ్ విద్యుత్ స్తంభాలకు జాతీయ జెండా రంగులతో కూడిన ఎల్ఈడీ డెకరేషన్ లైట్లు ఏర్పాటు చేయడంతో బాటసారులకు కొత్త అనుభూతిని కలిగిస్తుంది.



సైబర్ నేరాలతో జాగ్రత్త

- సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను
- పుల్లూరులో కార్డన్ సెర్చ్



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ శ్రీను

సిద్దిపేట రూరల్, మే10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను ప్రజలకు సూచించారు. శనివారం రాత్రి సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు మీ ఫోన్లకు పంపించే లింక్‌లను ఓపెన్ చేయవద్దని, మీ వ్యక్తిగత సమాచారం ఇవ్వకూడదని సూచించారు. గ్రామంలో ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదర్థాలు విక్రయించినా, వాడినా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. వాహనాలకు సంబంధించిన డాక్యుమెంట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలన్నారు. గ్రామంలో ఎలాంటి డాక్యుమెంట్లు లేని 50 మోటార్ సైకిల్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. పర్మిషన్ లేకుండా బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఇంటిపై రైడ్ చేసి 10.7 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామంలో ఎవరైన అనుమానితులు కనిపిస్తే 100 కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు అపూర్వ రెడ్డి, అసీఫ్, బాలకృష్ణ, గంగరాజు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, డాగ్ స్క్వాడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సొంత భవనాలు లేక తిప్పలు

- అద్దె భవనాల్లోనే గ్రామ సమాఖ్యల కార్యకలాపాలు
- మహిళా సంఘాల సభ్యులకు ఇబ్బందులు

8 లో

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

మెదక్ అర్బన్, మే 10 (ఆంధ్రజ్యోతి): మెదక్ రీజియన్ పరిధిలోని మెదక్, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి అడ్మిషన్లు ప్రారంభమైనట్లు రీజినల్ కోఆర్డినేటర్ గంగారామ్ నాయక్ తెలిపారు. ఈనెల 15న కామారెడ్డి గురుకుల, 16న చేగుంట బాలికల కళాశాలలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని తెలియజేశారు.

ప్రజలు మళ్లీ కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారు

- పథకాల అమలులో కాంగ్రెస్ విఫలం
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట రూరల్/సిద్దిపేట కల్చరల్/నంగనూరు, మే10 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అమలు చేసిన సంక్షేమాన్ని రాష్ట్ర ప్రజలు గుర్తు చేసుకుని మళ్లీ కేసీఆర్ పాలననే రావాలని కోరుకుంటున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శనివారం సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామంలో నూతనంగా నిర్మించిన పోచమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుతో రైతులు రెండు పంటలలు పండించుకుంటున్నామంటే అది మన కేసీఆర్ కృషితోనేనని గుర్తుచేశారు. సంక్షేమ పథకాల అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. చింతమడకలో కేసీఆర్ సహకారంతో 90 శాతం పనులు పూర్తి చేసుకున్నామని మిగిలింది 10 శాతమేనని అవి కుడా పూర్తి అయ్యేలా చూస్తామన్నారు.

● సిద్దపేట జిల్లా కేంద్రంలోని పటేల్‌పురలోని సంతోషిమాత దేవాలయంలో అఖిల భారత హనుమదీక్ష పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామిజీ పర్యవేక్షణలో జరుగుతున్న హనుమాన్ యజ్ఞంలో హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా సిద్దిపేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయ స్వర్ణోత్సవ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఆలయ దాతలు, సిద్దిపేట ప్రజాప్రతినిధులతో ఆయన కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

● నంగునూరు మండలం నర్మెట్ట గ్రామ శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే హరీశ్ రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ రమణాచారి ఆధ్వర్యంలో ఆయను ఘనంగా సన్మానించి జ్ఞాపికను అందజేశారు. అలాగే నర్మేట గ్రామంలో నిర్మిస్తున్న అయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అయిల్ ఫెడ్ కమిషనర్‌తో ఫోన్ లో మాట్లాడి ఆయిల్ రిఫనరి పనులు వెంటనే చేపట్టాలని సూచించారు.



హరీశ్‌రావును సన్మానిస్తున్న చింతమడక గ్రామస్థులు

అమర జవాన్‌కు ఘన నివాళి

సిద్దిపేట కల్చరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : భారత్ పాకిస్థాన్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళినాయక్ చిత్రపటానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఘనంగా నివాళులర్పించారు. శనివారం సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమర జవాన్లకు ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటారన్నారు. దేశ ప్రజలంతా జవాన్ల కుటుంబాలకు అండగా నిలబడాలన్నారు.





చోరీ నిందితులకు జైలు

జోగిపేట రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : చోరీకి పాల్పడ్డ నిందితులకు జైలు శిక్ష విధించింది. ఎస్ఐ పాండు వివరాల ప్రకారం.. 2014లో అందోల్ మండలం నాదులాపూర్‌కు చెందిన శ్రీశైలం ఇంట్లో అదే గ్రామానికి చెందిన మన్నె శ్రీనివాస్, అర్రె పెంటోజీ, బోయిని పాండు చోరీకి పాల్పడగా పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. శనివారం జోగిపేట మున్సిఫ్ కోర్టు జడ్జి మహ్మద్ అసాదుల్లా షరీఫ్ ముగ్గురికి సంవత్సరం జైలు శిక్ష విధించారు. ఇందులో శ్రీనివాస్‌కు జైలు శిక్షతో పాటు రూ.500ల జరిమానా విధించారని ఎస్ఐ తెలిపారు.



నగల కోసమే మహిళ హత్య

- 24 గంటల్లోనే కేసును ఛేదించిన గజ్వేల్ పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఏసీపీ పురుషోత్తంరెడ్డి


గజ్వేల్‌లోని పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ పురుషోత్తంరెడ్డి

గజ్వేల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : నగల కోసం మహిళను హత్యచేసిన నిందితురాలిని గజ్వేల్ పోలీసులు 24 గంటల్లో అరెస్ట్ చేసినట్లు గజ్వేల్ ఏసీపీ కె.పురుషోత్తంరెడ్డి తెలిపారు. గజ్వేల్ పట్టణంలోని బాలాజీనగర్‌లో ఈ నెల 8న సాయంత్రం మహిళ గడియారం బాలమణి(62) హత్య సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. మృతురాలి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న గజ్వేల్ పోలీసులు విచారణ చేపట్టారు. ఘటనా స్థలంతో పాటు నూతన టెక్నాలజీ, సీసీ పుటేజీని పరిశీలించి శనివారం అనుమానితురాలు రజియా అలియాస్ హసీనా(46)ను అదుపులోకి తీసుకుని విచారించగా.. నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. సంవత్సరం క్రితం కల్లు కంపౌండ్‌లో మృతురాలితో హసీనాకు పరిచయం ఏర్పడింది. ఈ పరిచయంతో రజియాకు అవసరమైనప్పుడల్లా మృతురాలి వద్ద డబ్బులు తీసుకునేది. నెలరోజుల క్రితం బాలమణికి ఆమె చిన్న కోడలు సరిత అలియాస్ వాణితో గొడవ జరుగగా, ఆమె తన భర్త ఇద్దరు పిల్లలతో సహా అద్దెకు రూం తీసుకుని ఉంటున్నారు. రజియా రెండు, మూడు సార్లు బాలమణి వద్దకు కల్లు తీసుకుని వెళ్లి అక్కడే సేవించేది. ఈ క్రమంలో మృతురాలి ఒంటిపై బంగారు, వెండి నగలను ఉండడాన్ని గమనించిన రజియా.. 8న మధ్యాహ్నం 3.30 గంటలకు ఆమె ఇంటికెళ్లి మెడలోని పసుపు దారంతో గట్టిగా గుంజి బాలమణిని చంపేసింది. అనంతరం బంగారు చెవిపోగులు, వెండి నగలు దొంగిలించినట్లు నేరం ఒప్పుకున్నదని ఏసీపీ తెలిపారు. నిందితురాలి నుంచి బంగారు, వెండి నగలను రికవరీ చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. కేసును ఛేదించిన గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ సైదా, అదనపు సీఐ ముత్యంరాజు, తొగుట సీఐ లతీఫ్, ఏఎస్ఐ ఓమర్, యాదగిరి, సిబ్బంది వెంకన్న, వెంకటేశ్, రవి, నరేందర్, స్వామి, దివ్యను ఏసీపీ పురుషోత్తంరెడ్డి అభినందించారు. త్వరలోనే సిద్దిపేట సీపీ చేతులమీదుగా రివార్డును అందజేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

జగదేవ్‌పూర్, మే 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందాడు. జగదేవ్‌పూర్ మండలం చాట్లపల్లికి చెందిన కృష్ణ, కవిత దంపతులకు కుమారుడు విష్ణువర్ధన్(5), కూతురు ఉన్నది. శనివారం సాయంత్రం విష్ణువర్ధన్ గ్రామంలో కిరాణా దుకాణానికి వెళ్లి, తిరిగి రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో జగదేవ్‌పూర్ నుంచి చేర్యాల వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో బాలుడు టైర్ కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. కళ్ల ముందే కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనపూర్‌లో గడ్డి ట్రాక్టర్ దగ్ధం


దగ్ధమవుతున్న ఎండు గడ్డి ట్రాక్టర్

తూప్రాన్, మే 10(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ మండలం ఘనపూర్‌లో శనివారం ఎండు గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. ఘనపూర్ గ్రామపంచాయతీ పరిధి దమ్మక్కపల్లి గ్రామానికి చెందిన బర్ల సాయిలు సుమారు వంద మోపుల ఎండుగడ్డిని తన ట్రాక్టర్‌లో సిద్దిపేట జిల్లాలోని మక్తామాసాన్‌పల్లికి తీసుకెళ్తున్నాడు. మార్గమధ్యలో ఘనపూర్ గ్రామంలోకి రాగానే ట్రాక్టర్‌కు కిందుగా ఉన్న విద్యుత్ వైర్లు తగిలి షాట్ సర్క్యూట్ ఏర్పడింది. ట్రాక్టర్‌లో ఉన్న గడ్డికి మంటలు అంటుకున్నాయి. డ్రైవర్ అప్రమత్తమై హైడ్రాలిక్ సహాయంతో కింద వేయడంతో ప్రమాదం తప్పింది.

అప్పులోళ్ల వేధింపులకు తండ్రి ఆత్మహత్య

- సంగాయిపేట గ్రామంలో విషాదం


శేఖర్(ఫైల్)

కొల్చారం, మే 10 (ఆంధ్రజ్యోతి) : తనయుడు చేసిన అప్పులకు తండ్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మెదక్ జిల్లా సంగాయిపేట గ్రామానికి చెందిన మన్నె శేఖర్(48)కు ఇద్దరు భార్యలు. మొదటి భార్య కుమారుడు సాయికిరణ్ వ్యాపారం కోసం గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో చాలావరకు అప్పులు చేశాడు. అయితే అప్పులు ఇచ్చినవారు తండ్రిని అడగడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మొదటి భార్య వసంత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో అందరితో కలుపుగోలుగా ఉండే శేఖర్ మృతిచెందడంతో గ్రామస్థులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి కుటుంబసభ్యులను మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి పరామర్శించి, ఓదార్చారు.

నిజాంపేటలో వ్యక్తి..


నాగరాజు(ఫైల్)

నిజాంపేట, మే 10 (ఆంధ్రజ్యోతి) : అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిజాంపేట మండలం నందిగామ గ్రామానికి చెందిన ఆకుల నాగరాజు(37) ఇద్దరు భార్యలతో జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ అవసరాల నిమిత్తం సుమారు రూ.6 నుంచి రూ.7 లక్షల వరకు అప్పులు చేశాడు. పని దొరక్క, అప్పులు తీర్చే మార్గం లేక శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి బాల్‌నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ప్రొబిషనరీ ఎస్ఐ సృజన తెలిపారు. నాగరాజు మృతితో భార్యలు, ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు.

ప్రమాదవశాత్తు నీట మునిగి వ్యక్తి మృతి

పాపన్నపేట, మే 10 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని అన్నారం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జనుముల శివరాములు(35) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. శనివారం గ్రామ శివారులోని కొత్తకుంట వద్ద ఉపాధిహామీ పనుల కోసం కుటుంబసభ్యులతో కలిసి వెళ్లాడు. కాగా కాలకృత్యాలకు సమీపంలో ఉన్న వాటర్‌షెడ్ చెక్‌డ్యాం వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగిపోయాడు. రాములు ఎంతకీ రాకపోయేసరికి కుటుంబీకులు చెక్‌డ్యాం వద్దకు వెళ్లగా ఒడ్డున చెప్పులు, దుస్తులు కనిపించాయి. నీటిలో గాలించగా మృతదేహం లభ్యమైంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. భార్య పావని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు మృతి


నరేష్(ఫైల్)

చేగుంట, మే 10 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు అందులో పడి మృతిచెందాడు. మెదక్ జిల్లా చేగుంట మండలం నార్సింగి గ్రామానికి చెందిన చందంపేట నరేష్(30) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామ శివారులోని కాముని చెరువులో గురువారం రాత్రి చేపల వేటకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో మునిగి మృతిచెందాడు. శనివారం మధ్యాహ్నం మృతదేహం తేలడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారమందించారు. ఎస్ఐ అహ్మద్ మొయినుద్దీన్ సంఘటనా స్థలానికి చేరుకుని జాలర్ల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించి, పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

కుక్కల దాడిలో 30 గొర్రెల మృత్యువాత



కుక్కల దాడిలో మృత్యువాత పడ్డ గొర్రెలు

హత్నూర, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఊర కుక్కల దాడిలో 30 గొర్రెలు మృత్యువాత పడ్డ సంఘటన సంగారెడ్డి జిల్లా హత్నూర మండల పరిధిలోని కాసాల గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన పాముల సురేష్, ఆరెగళ్ల కిష్టయ్య రోజు మాదిరిగానే గొర్రెలను మేతకు తీసుకెళ్లి సాయంత్రం పాకలో ఉంచారు. అర్ధరాత్రి సమయంలో ఊర కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో 30 మృతవాత పడ్డాయి. దీంతో సుమారు రూ.2 లక్షల వరకు నష్టపోయినట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు

ఆరు తులాల బంగారం మాయం

- బస్సులో ప్రయాణిస్తుండగా ఘటన

నర్సాపూర్, మే 10 (ఆంధ్రజ్యోతి) : వెల్దుర్తి నుంచి నర్సాపూర్‌కు ఆర్టీసీ బస్సులో వస్తున్న మహిళ బ్యాగులో ఉన్న ఆరు తులాల బంగారు నగలు చోరీకి గురైన ఘటన శనివారం చోటు చేసుకుంది. కౌడిపల్లి మండలం వెంకట్రావ్‌పేటకు చెందిన అనుసూయ వెల్దుర్తికి వెళ్లి.. తిరిగి తన సొంత గ్రామానికి వెళ్లేందుకు నర్సాపూర్ వచ్చే బస్సు ఎక్కింది. నర్సాపూర్ బస్టాండ్‌కు వచ్చాక అనుమానం వచ్చి బ్యాగు చూడగా.. అందులో ఉన్న ఆరు తులాల బంగారు నగలు కనిపించకపోవడంతో లబోదిమోమంటూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్ఐ లింగం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.













ఎల్లమ్మగుట్టపై పూర్తికాని

త్రిశులం, ఢమరుకం పనులు

- రూ.63 లక్షలతో పనులు
- డిజైన్ మార్పుతో రూ.20 లక్షలు పెరిగిన వ్యయం
- ఆరునెలల క్రితం కమిషనర్‌ను కోరినా మంజూరు కాని నిధులు
- దేవాదాయశాఖ నిర్లక్ష్యం

చేర్యాల, మే 10 (ఆంధ్రజ్యోతి) : పరమశివుడి ప్రతిరూపంగా విరాజిల్లుతున్న కొమురవెల్లి మల్లన్న ఆలయ ఔన్నత్యాన్ని చాటడంతో పాటు శైవక్షేత్ర ఆనవాలు ప్రతిబింబించేలా ఎల్లమ్మగుట్టపై త్రిశూలం-ఢమరుక ఏర్పాటుకు చర్యలు తీసుకున్నా నిధుల లేమి వెంటాడుతుంది. గత డిసెంబరులో జరిగే కల్యాణానికి అందుబాటులోకి తీసుకువస్తామని ఆలయవర్గాలు ప్రకటించి.. ఏర్పాటు పనులు వేగవంతం చేసినా నిధులు సరిపడకపోవడంతో అర్ధాంతరంగా వదిలేశారు. శ్రీశైలం, విజయవాడ తదితర ఆలయాల మాదిరిగా ఎల్లమ్మగుట్టపై త్రిశూలం, ఢమరుకం నెలకొల్పనుండటంతో నూతన శోభ సంతరించుకోనున్నదని భావించినా కార్యరూపం దాల్చకపోవడంతో భక్తులు ఉసూరుమంటున్నారు. ఆలయంలో యేటా మూడునెలలపాటు జరిగే మహా జాతరకు లక్షలాదిమంది భక్తులు తరలివస్తున్నారు. కాలక్రమేణా సాధారణ రోజుల్లోనూ భక్తుల రద్దీ పెరిగింది. కిక్కిరిసిన జనాలతో కిటకిటలాడే పరిసరాలు, చుట్టూ పచ్చని పొలాలు, చెరువు, గుట్టలతో కనువిందు చేస్తుండటంతో భక్తితో పాటు ఆహ్లాదాన్ని ఆస్వాదించేందుకు భక్తులు గుట్టపైకి ఎక్కడానికి తహతహలాడుతుంటారు. రాజీవ్ రహదారికి అతి సమీపంలో మల్లన్న ఆలయం ఉండటంతో సుదూరంనుండే రాజగోపురం, గుట్ట కనిపిస్తుంటుంది. పరమశివుడు త్రిశూలం, ఢమరుకం ధరించి ఉండటంతో ఆలయ కీర్తిని మరింత వ్యాప్తి చేసేందుకు ఎల్లమ్మగుట్టపై త్రిశూలం-ఢమరుకం ఏర్పాటు చేయాలని సంకల్పించి రూ.63 లక్షలు నిధులు కేటాయించారు. 20 సెప్టెంబరు 2023న శంకుస్థాపన చేయగా పనులు తుది దశకు చేరుకున్నాయి. హైదరాబాద్‌లోని ఓ కార్ఖానాలో స్టీల్‌తో త్రిశూలం, ఢమరుకం, ఓం ఆకారం తయారీ పనులు పూర్తిచేయించారు. ఈదురుగాలులు, వర్షానికి తట్టుకునేలా సంబంధిత ఆకారాలను బిగించేందుకు రెండు అంతస్తులలో స్లాబు భవనం నిర్మాణం పూర్తిచేశారు. మొదటి అంతస్తులో టికెట్ కౌంటర్, రెండో అతస్తు ప్రదేశాన్ని ఇతరత్రా అవసరాలకు వినియోగించుకోనున్నారు. కానీ డిజైనింగ్‌లో మార్పుల వల్ల ప్రతిపాదిత వ్యయం సరిపడలేదు. దీంతో అదనంగా రూ.20 లక్షలు అవసరపడతాయని, నిధులు మంజూరు చేస్తే పనులు పూర్తవుతాయని గతేడాది నవంబరు నెలాఖరులో దేవాదాయశాక కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపించారు. కానీ నేటికీ ప్రత్యామ్నాయ చర్యలు కానరాకపోవడంతో అతీగతీ లేకుండా మారింది. లక్షలాది రూపాయలు వెచ్చించినా ప్రయోజనం చేకూరకపోవడంతో భక్తులు ఉసూరుమంటున్నారు. ఈ విషయమై ఆలయ పాలకమండలితో పాటు అధికారులు ప్రత్యేక చొరవ వహించి త్రిశూలం ఓంకారం బిగింపు పనుల పూర్తికి చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

కమిషనర్ అనుమతి రాగానే పనులు పూర్తి చేస్తాం



మల్లన్న ఆలయం శైవక్షేత్ర ఆనవాలు ప్రతిబింబింపచేసేందుకు రూ.63 లక్షలతో ఎల్లమ్మ గుట్టపై త్రిశూలం, ఢమరుకం పనులు చేపట్టాం. బిగింపు పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. డిజైనింగ్‌లో మార్పు కారణంగా మరో రూ.20 లక్షలు అవసరపడ్డాయి. దేవాదాయశాఖ కమిషనర్ ద్వారా రివైజ్డ్ అనుమతులు రావడంతోనే పనుల పూర్తి చేయించి త్వరగా అందుబాటులోకి తీసుకొస్తాం.

- అన్నపూర్ణ, ఈవో



గుట్టపై త్రిశూలం, ఢమరుకం

సాఫీగా ధాన్యం కొనుగోళ్లు జరగాలి

- టార్పాలిన్, గన్నీ బ్యాగులు సరిపడా ఇవ్వాలి
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



అక్కన్నపేట కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

రామాయంపేట, మే 10 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లు సాఫీగా జరిగేలా చూడాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. తేమశాతం రాగానే పంట కొనాలని సూచించారు. శనివారం రామాయంపేట మండలం అక్కన్నపేట కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, రిజిస్టర్ పరిశీలించారు. అనంతరం నిర్వాహకులతో మాట్లాడుతూ ఎప్పటికప్పుడు పంట తూకం వేసి రైతు పేరిట ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. బస్తాలను లోడ్ చేసేందుకు లారీలను ముందుగానే ఉంచుకోవాలని తెలిపారు. కాగా ప్రస్తుతం గన్నీ సంచులు, టార్పాలిన్ కవర్లు సరిపడా ఉన్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. కొనుగోళ్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని కేంద్ర నిర్వాహకులకు సూచించారు.

సెక్యూరిటీ గార్డుపై దాడి

- డబ్బులు, మొబైల్ అపహరణ, ఆలస్యంగా ఫిర్యాదు

తూప్రాన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఆటోలో ప్రయాణిస్తున్న సెక్యూరిటీ గార్డుపై ఆటోడ్రైవర్, మరో ఇద్దరు దాడిచేసి, ఫోన్ నుంచి డబ్బులు బదిలీ చేయించుకొని, మొబైల్ ఫోన్‌ను కింద పడేసి ఉడాయించారు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణ పరిధిలో చోటు చేసుకోగా, ఆలస్యంగా శనివారం ఫిర్యాదు చేశారు. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం చత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన మనీష్‌కుమార్ గుర్జి తూప్రాన్‌లో ఉంటూ సెక్యూరిటీ సర్వీసెస్‌లో పనిచేస్తున్నాడు. గతనెల 30న సాయంత్రం మేడ్చల్ నుంచి తూప్రాన్ వైపు వస్తున్న ఆటోలో మనోహరాబాద్ మండలం ముప్పిరెడ్డిపల్లిలో దిగేందుకు ఎక్కాడు. ముప్పిరెడ్డిపల్లి వద్ద ఆటో ఆపమన్నా డ్రైవర్ ఆపకుండా వేగంగా ముందుకు తీసుకెళ్లాడు. ఆటోలో ఉన్న మరో ఇద్దరు వ్యక్తులు దాడిచేసి ఫోన్‌పే నుంచి రూ.2 వేలు బదిలీ చేయించుకున్నారు. తూప్రాన్ పట్టణ శివారులోని టోల్‌ప్లాజా వద్దకు రాగానే మొబైల్ ఫోన్ లాక్కొని కిందకు తోసి పడేశారు. తీవ్రంగా గాయపడటంతో ఆలస్యంగా శనివారం ఫిర్యాదు చేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.

మట్టి తరలింపుపై అధికారుల కొరడా

- తాడ్దానిపల్లిలో రెండు టిప్పర్లు సీజ్

పుల్‌కల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పుల్కల్ మండలంలో మట్టి అక్రమ తరలింపుపై రెవెన్యూ అధికారులు కొరడా ఝులిపించారు. ఉమ్మడి పుల్కల్ మండలంలోని గొంగ్లూరు, గంగోజిపేట, శివంపేట, తాడ్దానిపల్లి, సుల్తాన్‌పూర్, చౌటకూర్, సరాఫ్‌పల్లి తదితర గ్రామాల్లో కొంతమంది మట్టి దందా చేస్తున్నారు. రాత్రివేళల్లో గుట్టుచప్పుడు కాకుండా ఎక్స్‌కవేటర్లతో మట్టి తవ్వి టిప్పర్లలో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి తరలింపుపై రెవెన్యూ అధికారులకు స్థానికులు ఫిర్యాదు చేశారు. దీంతో చౌటకూర్ తహసీల్దార్ అనుదీప్ రెవెన్యూ సిబ్బందితో కలిసి శనివారం రాత్రి తాడ్దానిపల్లి గ్రామ శివారు నుంచి మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లు పట్టుకుని సీజ్‌చేసి, పుల్కల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్రమంగా మట్టిని తరలిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అనుదీప్ హెచ్చరించారు.

బైక్‌ను ఢీకొన్న డీసీఎం.. డ్రైవర్‌కు తీవ్రగాయాలు

రామాయంపేట, మే 10 (ఆంధ్రజ్యోతి) : చేగుంట హైవేపై ఓ బైకర్‌ను ఢీకొట్టి ఆపకుండా వస్తున్న కంటైనర్ డ్రైవర్ తృటిలో భారీ ప్రమాదాన్ని తప్పించుకున్నాడు. ప్రమాద స్థలంలో చూసిన కొందరు కంటైనర్‌ను వెంబడించారు. దీంతో అతివేగంగా నడుపుతూ.. కన్యాజన్‌లో రామాయంపేట రహదారిపై మరో డీసీఎంను ఢీకొని కొంత దూరంలోని కల్వర్టుకు తగిలి కంటైనర్ ఆగిపోయింది. డ్రైవర్ అబీద్‌ఖాన్ తలకు బలమైన గాయమైంది. పోలీసులు బాధితుడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కంపెనీ సామగ్రి, వ్యవసాయ పనిముట్లు చోరీ

తూప్రాన్, మే 10 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణ పరిధి రావెల్లి శివారులోని ఓ ప్రైవేటు కంపెనీ గోదాంలో ఉన్న కంపెనీ సామగ్రి, వ్యవసాయ పనిముట్లు చోరీకి గురయ్యాయి. ఎస్ఐ శివానందం వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణ పరిధి రావెల్లి శివారులో సన్‌షైన్ కెమికల్స్ కంపెనీకి చెందిన స్థలంలో గోదాం నిర్వహిస్తున్నారు. అందులో కంపెనీ యంత్రాలు, సామగ్రి, వ్యవసాయ పనిముట్లు నిలువ ఉంచుతున్నారు. ఈనెల 7న రాత్రి వర్షం రావడంతో వాచ్‌మెన్ నక్కపల్లి వెంకటేశ్ తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. 8న ఉదయం వచ్చి చూడగా కంపెనీకి చెందిన ఇనుప యంత్రాలు, సామగ్రి, వ్యవసాయ పనిముట్లు చోరీ జరిగినట్టు గుర్తించాడు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శనివారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

జవాన్ల త్యాగం అందరికీ స్ఫూర్తిదాయకం

- సైనికుల కుటుంబాలను కేంద్రం ఆదుకోవాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు



సంగారెడ్డిలోని కేకే భవన్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న చుక్క రాములు

సంగారెడ్డి రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : వీర జవాన్లు ప్రదర్శించిన ధైర్య సాహసాలు అందరికీ స్ఫూర్తిదాయకమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డిలోని కేవల్ కిషన్ భవన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ రక్షణలో అసువులు బాసిన జవాన్లకు సీపీఎం ప్రగాఢ సానుభూతి తెలియజేస్తుందన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన సైనిక కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. జిల్లాలో మంచినీటి ఎద్దడి రోజురోజుకు తీవ్రమవుతున్నదని, మంచినీటి సమస్యకు పరిష్కారం చూపాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహించడం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు సౌర్యాలు కల్పించాలని, తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జీ.సాయిలు, రాజయ్య పాల్గొన్నారు.

'పాలిసెట్'కు ఏర్పాట్లు పూర్తి

- హాజరుకానున్న 2784 మంది విద్యార్థులు



సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ జానకీదేవి

సంగారెడ్డి రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈ నెల 13న నిర్వహించనున్న పాలిసెట్ పరీక్షలకు అన్నిరకాల ఏర్పాట్లు చేశారు. సంగారెడ్డి విద్యానగర్‌లోని సెయింట్ ఆంథోని హైస్కూల్, బాలికల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్‌వీ జూనియర్ కళాశాల, కరుణ హైస్కూల్, బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోని హైస్కూల్, జోగిపేటలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మొత్తం 7 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు జిల్లా కో ఆర్డినేటర్ జానకీదేవి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థుల గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్ష ప్రారంభమైన తరువాత నిమిషం ఆలస్యమైనా లనుమతించబోమని స్పష్టం చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యార్థులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించామని జానకీదేవి తెలిపారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం: సీఐ

మెదక్ కల్చరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం మెదక్ మండల పరిధిలోని మక్త భూపతిపూర్ గ్రామంలో ఎంబీపూర్ సీజన్ ది క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు ఫోన్లలో ఉండడం, చెడు వ్యసనాలకు బానిసవ్వడం కంటే ఆటలపై దృష్టిసారించి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఉత్తమమని ఆయన సూచించారు.

అమర జవాన్‌కు నివాళులు



జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న నర్సంపల్లి పెద్దతండావాసులు

చేగుంట/వెల్దుర్తి, మే 10 (ఆంధ్రజ్యోతి) : భారత్-పాకిస్తాన్ యుద్ధంలో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్‌కు నార్సింగి మండలం నర్సంపల్లి పెద్దతండావాసులు శనివారం నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ చత్రియానాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ బిక్యానాయక్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు భాషానాయక్, తండావాసులు మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని జాతీయ జెండాతో తండాలో ర్యాలీ నిర్వహించారు. అలాగే వెల్దుర్తి మండలంలో మురళీనాయక్‌కు యువకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని వెల్దుర్తి బస్టాండ్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శేఖర్‌గౌడ్, వెంకటేష్, శ్రీనివాస్, నవీన్, చందు, పోచయ్య, భాను, పవన్, ప్రేమ్‌కుమార్, రంజిత్‌రెడ్డి, లక్ష్మణ్, హన్మాన్ స్వాములు తదితరులు పాల్గొన్నారు.



వెల్దుర్తిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

నాలుగు దశాబ్దాలుగా గుడిసెల్లోనే..!

- వివిధ ప్రాంతాల నుంచి కొత్తపేట గ్రామానికి వలస
- కనీస సౌకర్యాలకూ నోచుకోని గంగిరెద్దుల కుటుంబాలు
- ఏళ్లుగా విద్యుత్ సౌకర్యం లేక చీకట్లో జీవనం
- 40 కుటుంబాల్లో ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లు



కొత్తపేటలో గంగిరెద్దుల కుటుంబాలు ఏర్పాటు చేసుకున్న గుడిసెలు



విద్యుత్ సదుపాయం లేని గుడిసెలు

శివ్వంపేట, మే 10 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు.. గంగిరెద్దులతో డుడూ బసవన్నలతో ఇంటి ముందు నృత్యాలతో కనువిందు చేసే గంగిరెద్దుల కుటుంబాలు దుర్భర పరిస్థిలు ఎదుర్కొంటున్నారు. 40 ఏళ్లుగా తాత్కాలిక గుడిసెల్లో, విద్యుత్ లేక అంధకారంలో మగ్గుతున్నారంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. బాన్సువాడ, హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన బత్తుల ఎల్లయ్య, బత్తుల ఊశయ్య, మేకల సాయిలు, మేకల రాజు బత్తుల మారయ్యతో కలిపి మొత్తం 40 కుటుంబాల వారు మెదక్ జిల్లా శివ్వంపేట మండలం కొత్తపేట గ్రామానికి వలసొచ్చారు. ఇక్కడే గుడారాలు ఏర్పాటు చేసుకుని గంగిరెద్దులను ఆడిస్తూ భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే 40 ఏళ్లుగా వీరు కనీస సౌకర్యాలకు నోచుకోవడం లేదు. పక్కా ఇళ్ల అవస్థలు పడుతున్నారు. ఏళ్లుగా గ్రామపంచాయతీకి పన్ను కడుతున్నా తమను ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ 40 కుటుంబంలోని ఐదు కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకావడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మిగతా కుటుంబాలకు కూడా ఇళ్ల మంజూరు చేయాలని వేడుకుంటున్నారు.

20 ఏళ్లుగా ఇంటి పన్ను కడుతున్నాం



గ్రామంలో ఓటు హక్కు పొంది.. 20 ఏళ్లుగా ఇంటి పన్ను కడుతున్నాం. ఇప్పటికీ తమ కుటుంబాలకు సొంత ఇల్లు లేదు. విద్యుత్ మీటర్లు లేవు. రోడ్లు, మురుగు కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం తమ కుటుంబాలకు మౌలిక వసతులు కల్పించాలి.

- పోచమ్మ, కొత్తపేట

తాతల నుంచి ఇక్కడే ఉంటున్నాం



తాతల కాలం నుంచి కొత్తపేటలో గుడిసెలను ఏర్పాటు చేసుకొని గ్రామాల్లో భిక్షాటన చేస్తూ బతుకుతున్నాం. సొంత ఇల్లు లేక వర్షాకాలంలో ప్లాస్టిక్ కవర్లు, తడకలతో ఏర్పాటు చేసుకున్న గుడిసెలు చిన్నపాటి వర్షానికే ఉరుస్తున్నాయి. 20 నుంచి 30 గజాల్లో ఉన్న గుడిసెల్లో పిల్లలతో కాలం వెళ్లదీస్తున్నాం.

- మేకల సాయిలు, కొత్తపేట

సొంత భవనాలు లేక తిప్పలు

- అద్దె భవనాల్లోనే గ్రామ సమాఖ్యల కార్యకలాపాలు
- మహిళా సంఘాల సభ్యులకు ఇబ్బందులు
- శాశ్వత భవనాల కోసం ఎదురుచూపులు



సిద్దిపేట రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేస్తున్న గ్రామ సమాఖ్య సంఘాలకు సొంత భవనాలు లేక సభ్యులు తిప్పలు పడుతున్నారు. సిద్దిపేట రూరల్ మండలం, నారాయణరావుపేట మండలాల్లోని పలు గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలకు సొంత భవనాలు లేవు. స్వయం సహాయక సంఘాల సభ్యుల ఇళ్లల్లో, అద్దె భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళా సంఘాల సమావేశాలు నిర్వహిస్తున్నారు. సిద్దిపేట రూరల్ మండలంలో 15 గ్రామ పంచాయితీల్లో 27 గ్రామైఖ్య సంఘాలు, నారాయణరావుపేట మండలంలో 11 గ్రామ పంచాయితీల్లో 19 గ్రామైఖ్య సంఘాలు ఉన్నాయి. సిద్దిపేట రూరల్ మండలం బండచెర్లపల్లి, బచ్చాయిపల్లి, నారాయణరావుపేట మండంలో శేఖర్‌రావుపేటలో గ్రామైఖ్య సంఘాలకు సొంత భవనాలు లేవు. గోపులాపూర్‌లో గ్రామైఖ్య సంఘం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. నారాయణరావుపేట మండలం ఏర్పడి ఆరేళ్లు గడుస్తున్నా మండల సమాఖ్య భవనం లేదు. ఆయా గ్రామాల్లో సొంత భవనాలు ఏర్పాటు చేయాలని సభ్యులు కోరుతున్నారు.

శాశ్వత భవనం నిర్మించాలి



గ్రామైఖ్య సంఘానికి శాశ్వత భవనం కోసం గత ప్రభుత్వ హయాంలోనే ప్రతిపాదనలు పంపించాం. సంఘం సభ్యుల సమవేశాలు నిర్వహణకు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం భవనాన్ని తాత్కలికంగా వినియోగించుకుంటున్నారు. కానీ సభ్యులకు శిక్షణ ఇచ్చే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

-వీణా, మాజీ సర్పంచ్, బండచెర్లపల్లి

శాశ్వత భవనం నిర్మించాలి



మండలంలో 19 గ్రామైఖ్య సంఘాలు ఉన్నప్పటికి రెండు సంఘాలకు ఇబ్బంది ఏర్పడుతున్నది. మండల సమాఖ్యకు సొంత భవనం లేకపోవడంతో అన్ని కార్యకలాపాలు మండల కేంద్రంలోని గ్రామైఖ్య సంఘంలోనే కొనసాగిస్తున్నాం. శాశ్వత భవనాల కోసం ప్రభుత్వం దృష్టికి తీసువెళ్లాం.

- చంద్రం, ఏపీఎం, నారాయణరావుపేట

న్యూస్ బాక్స్

మేము సైతం



ఏకగ్రీవ తీర్మానం చేసిన రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్

సిద్దిపేట కల్చరల్, మే 10 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జమ్ము కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిలో చనిపోయిన వారికి నివాళులర్పించారు. అలాగే త్రివిధ దళాలు చేపట్టిన అపరేషన్ సిందూర్‌కు, భారత సైనికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భారత్ పాక్ యుద్ధంలో తమ సేవలు అవసరం అనుకుంటే వినియోగించుకోవచ్చని కేంద్రానికి తెలిపారు. ఈ నేపథ్యంలో తామంతా సిద్ధమని ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు లింకేజీ లేకుండా రుణాలు ఇవ్వాలి

రాయపోల్, మే 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెట్టిన రాజీవ్ వికాస్ స్కీమును లబ్ధిదారులకు బ్యాంకు లింకేజీ లేకుండా అందజేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయనను ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పుర్ర నర్సింలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కొమురవెల్లి మండల కమిటీ కార్యవర్గ నియామకం

చేర్యాల, మే 10 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ కొమురవెల్లి మండల కమిటీ కార్యవర్గాన్ని నియమించినట్లు అధ్యక్షురాలు బూర్గోజు స్వరూప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యక్షులుగా జనగామ తిరుపతి, మద్దికుంట కరుణాకర్, ఈగ కనకయ్య, గోవర్ధన సంతోషి, ప్రధాన కార్యదర్శులుగా బొడుగం కృష్ణారెడ్డి, ఎక్కలదేవి శ్రీనివాస్, కార్యదర్శులుగా కొంతం రాజు, తలారి నాగరాజు, ఘనబోయిన విజయ, మాట్ల కనకయ్య, కోశాధికారిగా అక్కినపల్లి సంపత్‌రెడ్డితో పాటు కార్యవర్గసభ్యులను నియమించినట్లు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి కాపర్‌వైర్ అపహరణ

చేర్యాల, మే 10 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం పోసాన్‌పల్లి గ్రామశివారులోని వ్యవసాయబావుల వద్ద రెండు 16కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి ధ్వంసం చేసి కాపర్‌వైర్ అపహరించుకుపోయారు. రైతులు అందించిన సమాచారం మేరకు విద్యుత్‌అధికారులు ఆయా ప్రదేశాలను సందర్శించి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. ఈవిషయమై రైతులు అప్రమత్తంగా ఉండాలని కొమురవెల్లి ఏఈ మధు కోరారు.

ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరం

దౌల్తాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ శృతి సింధూనూరి అన్నారు. శనివారం మండల కేంద్రమైన దౌల్తాబాద్ సహస్ర చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత సంతాన సాఫల్య వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిబిరంలో 150 మందిని పరిక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని అన్నారు. అలాగే ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న దంపతులకు సంతాన సమస్యలపై సమగ్రమైన వైద్య సలహాలు, సూచనలు అందించినట్లు తెలిపారు.

అమరవీరుల ఆత్మశాంతికి కొవ్వొత్తులతో ర్యాలీ



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించిన గ్రామస్థులు

మద్దూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): మద్దూరు మండలంలోని లద్నూరులో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన అమరజవానుల ఆత్మశాంతికి క్రొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. దాడులను సమర్థవంతంగా తిప్పికొట్టడంతో పాటు భారత్‌దేశ సత్తాను చాటినందున గర్వకారణంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లోని వస్తువులు దగ్ధం

గజ్వేల్ రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడకండ్ల గ్రామంలో విద్యుత్ షాట్‌సర్క్యూట్‌తో గృహ ఉపకరణాలు దగ్ధం అయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన నాగపురి బాలవ్వ కుటుంబ సభ్యులు శనివారం బయటకు వెళ్లారు. అంతలోనే షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో ఉన్న టీవీ, ఇతర వస్తువులు దగ్ధం అయ్యాయి. గ్రామస్థులు బాధిత కుటుంబానికి సమాచారం అందించారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చూడాలి

- సీసీలు ఎప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలి

దౌల్తాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): వాతవారణ మార్పుల వల్లన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డీఆర్‌డీవో జయదేవ్ ఆర్య, ఐకేపీ సిబ్బందిని ,సెంటర్ల నిర్వకులను అదేశించారు.శనివారం సాయంత్రం మండల పరిదిలోని ముబ్బారస్‌పూర్‌లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్ డీవో జయదేవ్ అర్య ఆకస్మాకంగా తనిఖీ రైతుల నుంచి కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలను వివరాలు అడిగి తెలుసుకున్నారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, లారీలల్లో ధాన్యం తరలించిన వెంటనే కొనుగోలు కేంద్రాల నిర్వహకులు ట్యాబ్ ఎంట్రీని వెంటనే చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం యాదగిరి, సీసీ సునీత, వీవో కవిత, రైతులు, తదితరులు ఉన్నారు.



ఐకేపీ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకుంటున్న డీఆర్‌డీవో జయదేవ్ ఆర్య



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ జగదేవ్ ఆర్య.

రాయపోల్, మే 10 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి జగదేవ్ ఆర్య ఐకేపీ సిబ్బందికి సూచించారు. శనివారం ఆయన రాయపోల్ మండలం లింగారెడ్డిపల్లి గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, టెంట్ల సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే రైతులకు అవసరమైన మేరకు గన్నీ బ్యాగ్స్ టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే సంబందిత మిల్లులకు తరలించాలని పేర్కొన్నారు. నిర్వాహకులు అన్ని రకాల రిజిస్టర్‌లను విధిగా నిర్వహించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య



సమ్మర్‌క్యాంప్ సర్టిఫికెట్స్‌ను చూపిస్తున్న చిన్నారులు

జగదేవ్‌పూర్, మే 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ విద్య లభిస్తుందని మునిగడప కాంప్లెక్స్ ప్రధాన ఎచ్ ఎం కనకయ్య పేర్కొన్నారు. మునిగడపలో ప్రాథమిక పాఠశాలలో సమ్మర్‌క్యాంపు ముగింపు సమావేశం ఎచ్ఎం శ్యామల అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎచ్ఎం కనకయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమమైన విద్య అందుతుందని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామస్థులు సహకరించాలని సమ్మర్ క్యాంపులో నేర్చుకున్న నైపుణ్యాలను సెలవులలో ఇంకా బాగా అభివృద్ధి చేసుకోవాలని తెలియజేశారు. సమ్మర్‌క్యాంపులో భాగంగా చిత్రలేఖనం, అందమైన చేతి రాత, పాటలు, డాన్స్‌ఓరిగామి వంటి అంశాలపై విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చామన్నారు. పాల్గొన్న విద్యార్థులందరికీ అతిథుల చేత సర్టిఫికెట్లను అందించారు.

నేడు విద్యుత్ అంతరాయం

ములుగు/ధూళిమిట్ట, మే 10 (ఆంధ్రజ్యోతి): నేడు జిల్లాలోని ములుగు, ధూళిమిట్ట మండలాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్, ఏఈ రాజు తెలిపారు. శనివారం ఏఈ శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ మండల పరిధిలోని మామిడాల ఆర్‌అండ్‌ఆర్ ముంపు గ్రామాల ప్రజలకు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. గ్రామంలో ట్రాన్స్ఫార్మర్ షిఫ్టింగ్ చేయడం వలన అంతరాయం ఏర్పడుతుందన్నారు. తిరిగి యధావిధిగా విద్యుత్ సరఫరా చేస్తామని ఆయన తెలిపారు.

ధూళిమిట్టలో

మండల కేంద్రంలోని 33 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మత్తుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు ధూళిమిట్ట,బైరాన్‌పల్లి,బెక్కల్ గ్రామాల సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలనీ ఏఈ రాజు ఓక ప్రకటనలో తెలిపారు.

ధాన్యం చోరీ పై పోలీసుల విచారణ

బెజ్జంకి, మే 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరుకబండ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం చోరి పై శనివారం పోలీసులు విచారణ చేపట్టారు. గుండారం గ్రామానికి చెందిన రైతు తిరుపతిరెడ్డి కొనుగోలు కేంద్రంలో ధాన్యం పోశాడు. ధాన్యం కుప్పలో నుంచి సుమారు 15 బస్తాల ధాన్యాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని గుర్తించి కేంద్రం నిర్వాహకులకు. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించాలి

మిరుదొడ్డి, మే10 (ఆంధ్రజ్యోతి): మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలోని మాలసంఘానికి సంబంధించిన విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరిగిందని సంఘం సభ్యులు అన్నారు. శనివారం గ్రామంలో కులపెద్దలతో కలిసి మాట్లాడారు. గ్రామంలోని మాలనల్లపోశయ్య వార్షికోత్సవం ఉందని అధికారులకు చెప్పిన విద్యుత్ సరఫరాను చేయడం లేదని తెలిపారు. తక్షణమే విద్యుత్ అధికారులు స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో మాలసంఘం సభ్యులు తదితరులున్నారు.

రాయపోల్ గిర్దావార్ బదిలీ

రాయపోల్, మే 10 (ఆంధ్రజ్యోతి): రాయపోల్ తహసీల్దార్ కార్యాలయంలో గిర్దావర్‌గా పనిచేస్తున్న భానుప్రకాష్ రావు బదిలీ అయ్యారు. ఆయనను సిద్దిపేట ఆర్డీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. తొగుట తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న రాజమల్లు రాయపోల్ గిర్దావర్‌గా రానున్నారు. అశోక్ సోమవారం బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది.

మృతుల కుటుంబాలకు పరామర్శ



మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న బక్కి వెంటకయ్య

మిరుదొడ్డి,మే10(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రమైన అక్బర్‌పేట-భూంపల్లిలో అనారోగ్యంతో మృతిచెందిన రాజయ్య, నాగయ్య, మండలంలోని పోతరెడ్డిపేట గ్రామానికి చెందిన పోశయ్య, రాజిరెడ్డిలు ఇటీవల మృతిచెందాడు.శనివారం ఈవిషయాన్ని తెలుసుకున్న మృతులను కుటుంబాలను రాష్ట్ర ఎస్సీఎస్టీ కమీషన్ బక్కి వెంకటయ్య పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు కృష్ణ, బుచ్చయ్య,ప్రవీన్ తదితరులున్నారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠ



అలిరాజపేటలో బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలు

జగదేవ్‌పూర్, మే 10 (ఆంధ్రజ్యోతి): జగదేవ్‌పూర్ మండలంలోని అలిరాజపేట గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. రెండు రోజులుగా జరిగిన బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాలలో భాగంగా గణపతి పూజ, స్థాపితాహోమం, పుణ్యాహవచనం, ధాన్యాధివాసం, శయ్యాదివాసం కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఉదయం గ్రామం మధ్యలో పూజాకార్యక్రమాలు నిర్వహించగా గ్రామంలోని ఆడపడుచులంతా బొడ్రాయికి బిందెలతో నీళ్లు తెచ్చి పోశారు. అనంతరం వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. అలాగే గ్రామ దేవతలకు పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో అన్ని గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బిగ్‌బాస్ 7 విన్నర్ రైతు బిడ్డ పల్లవి ప్రశాంత్ బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు వేణు పంతులు, గ్రామ నాయకులు జనార్దన్‌రెడ్డి, తదితరులున్నారు.

సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం

హుస్నాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని సిద్దేశ్వరగుట్టపై ఉన్న సంతోషిమాతా దేవాలయ 15వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, గణపతి పూజ, నవగ్రహ పూజ, కలశస్థాపన, లక్ష్మీ హోమం, లలిత సహస్ర నామ పారాయణం, పూర్ణహుతితో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, దేవాలయ కమిటీ చైర్మెన్ కొత్తపల్లి అశోక్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కోమటి సత్యనారాయణ, దొడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయ ఉత్సవ కమిటీ నియామకం

హుస్నాబాద్, మే 10 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ రేణుకా ఎల్లమ్మ ఆలయ ఉత్సవ కమిటీని నియమిస్తూ దేవాదాయ శాఖ అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ ఈ నెల 12వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు ఉంటుందని పేర్కొన్నారు. ఉత్సవ కమిటీలో పచ్చిమట్ల రాధ, పూదరి శ్రీనివాస్, పచ్చిమట్ల శ్రీకాంత్, పెరుమాళ్ళ నర్సాగౌడ్, ముప్పిడి రాజిరెడ్డి, గడిపె రమాదేవి, పలువురిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మొక్కు తీర్చుకున్న మైనంపల్లి

గజ్వేల్ రూరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ మండలం దిలాల్‌పూర్‌లోని స్వయంభు శ్రీ లక్ష్మి నరసింహస్వామి క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతురావు క్రితం ఏడాది ఇచ్చిన మాట ప్రకారం నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ చేసి మొక్కు తీర్చుకున్నారు. రెండు రోజులుగా కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలలో తిరుమల రఘునాథ చార్యులు వైదిక నిర్వహణలో ప్రతి రోజు ఆలయంలో పురుష సూక్త సహిత మూలమంత్ర హవనము నిర్వహిస్తున్నారు. ఆదివారం సుదర్శనహోమం, లక్ష్మి నరసింహ స్వామికి శతకటాభిషేకం, చక్ర స్నానం అనంతరం శ్రీ లక్ష్మి నరసింహ స్వామి కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. సాయంత్రం స్వామివారి పుష్ప రథోత్సవం ఘనంగా జరగనుంది.

చెత్త చెత్తగా..

(5వ పేజీ తరువాయి)

కార్యదర్శులకు అప్పగించారు. వీరితోపాటు ప్రత్యేక అధికారులుగా మండల స్థాయి అధికారిని సైతం ప్రభుత్వం నియమించింది. వీరికి రోజువారిగా ఉండే విధులతో పాటు అదనంగా గ్రామాల బాధ్యత అప్పగించడంతో పలువురు అధికారులు నామమాత్రంగా వ్యవహరిస్తూ గ్రామాల నిర్వహణ గాలికి వదిలేశారని పలువురు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విష జ్వరాలు విజృంభించకముందే పారిశుధ్య నిర్వహణను గాడిలోకి తేవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

చెత్తరహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి



రావురూకుల గ్రామంలో గ్రామపంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం వల్ల గ్రామం పరిధిలోని మురుగు కాలువల పూడిక తీత చెత్తను సకాలంలో తొలగించడంలేదు. దీంతో ఆ చెత్తను తిరిగి అదే కాలువలో పడి మురుగు సమస్య ఏర్పడుతున్నది. దుర్వాసనను భరించలేకపోతున్నాం. విషజ్వరాలు ప్రబలే ప్రమాదమున్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

బండి శివకుమార్, రావురూకుల

కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఏఎంసీ చైర్మన్

బెజ్జంకి, మే 10 (ఆంధ్రజ్యోతి) :మండలం కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న పొద్దుతిరుగుడు, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ పరిశీలించారు.. కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని ఆయన కేంద్రం నిర్వాహకులకు సూచించారు. పెరుకబండ గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి కొనుగోలు కేంద్రంలో జరిగిన చోరీ పై పోలీసులు విచారణ చేపట్టాలని కోరారు.

భారత సైనికులకు భగవంతుడి అండ

- కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి



ప్రమాణస్వీకారం చేసిన నూతన డైరెక్టర్లు

సిద్ధిపేట కల్చరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో యుద్ధం చేస్తున్న భారత సైనికులకు ఆ భగవంతుడు తోడుగా నిలిచి వారికి మరింత శక్తినివ్వాలని కాంగ్రెస్ పార్టీ సిద్ధిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ ఆకాంక్షించారు. సిద్ధిపేటలోని శ్రీ వెంకటేశ్వర దేవాలయం పునర్ నిర్మాణ కమిటిలో భాగంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన 13 మంది డైరెక్టర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా పూజల హరికృష్ణ, అత్తు ఇమామ్ మాట్లాడుతూ పహల్గామ్‌లో టూరిస్టులపై నిర్దాక్షణంగా పాకిస్థాన్‌కు చెందిన ఉగ్రవాదులు కాల్పులు జరపడం అమానుషం అని అన్నారు. వారిని భారత సైనికులు విడిచి పెట్టవద్దని అన్నారు. శాంతియుతంగా ఉన్న భారతదేశాన్ని పాకిస్థాన్ కావాలని రెచ్చగొట్టేలా చేస్తుంది అని అన్నారు. పాకిస్థాన్ చేస్తున్న కవ్వింపు చర్యలకు భారత సైనికులు గట్టి గుణపాఠం చెప్తున్నారు అని అన్నారు. ఇదే స్ఫూర్తితో శత్రువులను ఏరి పారాయాలని భారతదేశం మొత్తం సైనికులకు అండగా నిలుస్తుంది అని అన్నారు. శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన డైరెక్టర్లు దేవాలయ అభివృద్ధికి పాటుపడాలి అని అన్నారు.

హనుమాన్ మాలధారు స్వాముల ప్రత్యేక పూజలు

చిన్నకోడూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): భారత్ - పాకిస్థాన్‌కు యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో భారత సైన్యానికి మద్దతుగా శనివారం చిన్నకోడూరు మండలం చంద్లాపూర్‌లోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ మాలధారణ స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు జై శ్రీరామ్, భారత్ మాతాకి జై, జై జవాన్, జై కిసాన్ అంటూ జోరుగా నినాదాలు చేశారు. భారత సైనికులకు శక్తి చేకూరాలని, ఉగ్రవాదాన్ని నామరూపాలు లేకుండా ఏరివేయాలని స్వామి వారిని వేడుకున్నట్లు వారు తెలిపారు. అనంతరం గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ బుర్ర నరేష్ దంపతులను సన్మానించారు.

దాతల సహకారంతో మల్లన్న ఆలయ అభివృద్ధి



విరాళచెక్కు అందజేస్తున్న కరీంనగర్ భక్తుడు ఉప్పల శ్రీనివాస్

చేర్యాల, మే 10 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్న ఆలయాభివృద్ధిలో దాతల సహకారం ఎనలేనిదని ఆలయ ఈవో అన్నపూర్ణ అన్నారు. డోనార్ స్కీం ద్వారా రూ.17కోట్ల వ్యయంతో ఆలయపరిధిలో 100గదుల సత్ర భవన నిర్మాణం చేపట్టబోతున్న క్రమంలో కరీంనగర్‌కు చెందిన ఉప్పల శ్రీనివాస్ కాటేజ్ నిర్మాణం కోసం రూ.15లక్షలు విరాళ చెక్కును శనివారం అందచేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దాతల సహాయంతో మౌళికవసతుల కల్పనకు చిత్తశుద్ధితో పాటుపడుతామన్నారు. కాటేజీల నిర్మాణానికి దాతలు ముందుకురావాలని కోరారు. కమీషనర్ ఆదేశానుసారం త్వరలో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కాటేజీల నిర్మాణానికి అంగీకరించి విరాళమందించే దాతలకు తగిన గుర్తింపు, గౌరవం కల్పిస్తామన్నారు.

శ్రీ కృష్ణ యాదవ సంఘం నూతన కార్యవర్గం

చిన్నకోడూరు, మే 10 (ఆంధ్రజ్యోతి): శ్రీ కృష్ణ యాదవ సంఘం చిన్నకోడూరు మండల నూతన కార్యవర్గాన్ని, శనివారం చిన్నకోడూరులో నిర్వహించిన సమావేశంలో ఆ సంఘం సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సందబోయిన పర్శరాం, ఉపాధ్యక్షుడిగా బంక పోచయ్య, ప్రధాన కార్యదర్శిగా సిద్దుల శ్రీనివాస్, కార్యదర్శులుగా సందబోయిన వెంకట నర్సయ్య, పొట్ల ఎల్లయ్య, క్యాషియర్‌గా ఇస్కిల్ల పర్శరాములు తదితరులు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ కేంద్రాల్లోనూ ఉపాధ్యాయ శిక్షణ

- పీఆర్‌టీయూ



మాట్లాడుతున్న ఇంద్రసేనారెడ్డి, శశిధర్ శర్మ

సిద్దిపేట కల్చరల్, మే 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉపాధ్యాయ శిక్షణలు, స్కూల్ అసిస్టెంట్ శిక్షణలు జిల్లా కేంద్రంలో కాకుండా డివిజన్ కేంద్రాల్లో నిర్వహిస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుందని పీఆర్‌టీయూ సిద్దిపేట జిల్లా శాఖ అధ్యక్షుడు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదరాసుపల్లి శశిధర్ శర్మ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎండల తీవ్రత విపరీతంగా ఉన్న నేపథ్యంలో స్కూల్ అసిస్టెంట్ల శిక్షణా కార్యక్రమం కోసం జిల్లాలోని నలుమూలల నుండి ఉపాధ్యాయులందరినీ జిల్లా కేంద్రానికి రప్పించడం ఇబ్బందికరంగా మారుతుందని, జిల్లా కేంద్రంలో అందరూ ఉపాధ్యాయులకు ఒకేసారి ఏర్పాటు చేయడం కూడా కష్టమవుతుందన్నారు. ఈ నేపథ్యంలో స్కూల్ అసిస్టెంట్ శిక్షణలు డివిజన్ల వారిగా నిర్వహించాలని కోరారు. డివిజన్ కేంద్రాల్లో శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసి ఉపాధ్యాయులు వారి సమీప డివిజన్ కేంద్రంలో పాల్గొనేటట్లు అవకాశం కల్పించాలన్నారు. దీనివలన ఉపాధ్యాయులకు ఇబ్బందులు తగ్గుతాయని శిక్షణలు విజయవంతం అవుతాయని ఇంద్రసేనారెడ్డి శశిధర్ శర్మ విద్యాధికారులను కోరారు.

ఉమ్మడి మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న లింగారావు

కొండపాక, మే 10 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం వెలికట్ట గ్రామంలో ఉమ్మడి మండల స్థాయి క్రీడా పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసరి లింగారావు, పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్ రావు, ఆరుట్ల సంపత్ కుమార్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నారు. క్రీడా పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. యువకులు క్రీడా స్ఫూర్తితో వాటిపై ఆసక్తి పెంచుకుని నైపుణ్యం సాధించాలన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని డ్రగ్స్ మద్యానికి బానిస కాకుండా ఉండాలని పేర్కొన్నారు. క్రీడలకు రోజులో కొంత భాగం కేటాయిస్తే మానసిక ప్రశాంతతతో పాటు శారీరకదృఢత్వం ఏర్పడుతుందన్నారు. యువత ఆర్మీలో చేరి దేశ రక్షణకు తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ ఆర్గనైజర్, వివిధ గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

మొదటి విడత అడ్మిషన్లు

గజ్వేల్, మే 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి విడత అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. పదవ తరగతి పాసైన విద్యార్థులు నేరుగా కళాశాలకు వచ్చి అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. ఇటీవల జరిగిన వార్షిక పరీక్షల్లో తమ కళాశాల ద్వితీయ సంవత్సరంలో 74.7శాతం, మొదటి సంవత్సరంలో 65.67శాతంతో సిద్దిపేట జిల్లాలోనే ఉత్తమ ఫలితాలు సాధించిందని తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులు, విశాలమైన కళాశాల ప్రాంగణం, విశాలమైన తరగతి గదులు, హాస్టల్ వసతి, అన్ని వసతులతో కూడిన ప్రయోగశాలలు, ఉచిత పాఠ్యపుస్తకాలు, ఆర్వోప్లాంటు ద్వారా తాగునీరు తదితర సదుపాయాలు ఉన్నాయని, విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.